రామరక్షాస్తోత్రము

బుధకౌశికమునివిరచితము

తాత్పర్యకర్త

శ్రీమాన్ చలమచర్ల వేంకట శేషాచార్యులు

శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్సు

హైదరాబాదు

రామరక్షాస్తోత్రము

ఆంధ్రతాత్పర్యసహితము

ప్రథమముద్రణ - 1997
మూల్యము రూ. 4/-

ప్రకాశకులు :
శ్రీజయలక్ష్మీ పబ్లికేషన్సు,
3-35, రామాలయంవద్ద, కూకట్‌పల్లి,
హైదరాబాదు - 500 072. ఫోన్ : 886598

డిస్ట్రిబ్యూటర్స్ :
శ్రీగోపాల్ పబ్లికేషన్సు,
3-3-860, ఆర్యసమాజ్ ఎదురుసందులో
కాచిగూడా, హైదరాబాదు - 27.
ఫోన్ : 4658101.

'రామరక్షాకవచం' సిద్ధించే విధానం

ఈ రామరక్షాస్తోత్ర పారాయణం తొమ్మిదిరోజులు (నవరాత్ర పారాయణ) చేయవలసిఉంటుంది. ఆ తొమ్మిది రోజులు వసంతనవ రాత్రులుగానీ శరన్నవరాత్రుల వంటి పర్వదినాలుకానీ మరీ మంచిది. ఈ రెంటిలో కూడా వసంతనవరాత్రులలో పారాయణం మరింత శ్రేయస్కరం.

ఈ నవరాత్రపారాయణం చేయదలచేవారు ప్రతిరోజూ బ్రాహ్మముహూర్తంలో (అరుణోదయానికి ముందు-తెల్లవారుజామున) స్నానాది నిత్యానుష్ఠానం ముగించుకొని పరిశుద్ధులై, శుద్ధవస్త్రాలు ధరించి, లభిస్తే దర్భాసనం పైన లేదా శుద్ధమైన పీటపై వస్త్రం పరచి దానిపైన సుఖంగా పద్మాసనం వేసి కూర్చోనాలి. తమ మనస్సును ఏకాగ్రం చేసికొని, జగద్రక్షాదీక్షితుడైన శ్రీరామచంద్రభగవానునిపై నిలిపి మహాఫలాన్నిచ్చే ఈ స్తోత్రాన్ని పదకొండుసార్లు, అలా వీలు కానట్లైతే కనీసం ఏడుసార్లు నియమంగా ప్రతిరోజూ పారాయణం చేయాలి.

పారాయణ చేసేవారికి శ్రీరాముని శక్తిసామర్థ్యాలూ, మాహాత్మ్యంపై ఎంతటి శ్రద్ధ ఉంటుందో అంతటి ఫలం లభిస్తుంది.

ఈ మాత్రం కూడా పారాయణకు (11 లేక 7 మార్లు) అవకాశం లేనివారు దీనిని సంక్షిప్తంగానూ పారాయణ చేయవచ్చు. "శిరో మే రాఘవః పాతు" (4వ శ్లో.) దగ్గరనుండి "పాతురామోఽఖిలం వపుః" (9వ శ్లో.) వరకూ సంక్షిప్తపారాయణం అవుతుంది. అయితే ఈ పారాయణలో మొదటిసారి "శిరో మే రాఘవః పాతు" కు ముందున్న భాగంకూడా కలుపుకొని పారాయణ ప్రారంభించాలి. చివరిసారి "పాతు రామోఽఖిలం వపుః" కు తర్వాతి భాగం చివరివరకూ కలుపుకొనిపారాయణ చేయాలి.

ఈ పారాయణ ద్వారా శ్రీరామచంద్రుని పరిపూర్ణమైన అనుగ్రహం లభిస్తుంది. ఆయురారోగ్యైశ్వర్యాలూ కీర్తిప్రతిష్ఠలూ ఒకటేమిటి-సకల శ్రేయస్సులూ ప్రాప్తిస్తాయి.

రామరక్షాస్తోత్రము

వినియోగః

అస్య శ్రీరామరక్షాస్తోత్రమహామంత్రస్య బుధకౌశికః ఋషిః. శ్రీసీతారామచంద్రో దేవతా. అనుష్టుప్ ఛందః. సీతా శక్తిః. శ్రీమాన్ హనుమాన్ కీలకమ్. శ్రీరామచంద్రప్రీత్యర్థే రామరక్షాస్తోత్రజపే వినియోగః

ఈ రామరక్షాస్తోత్రమంత్రమునకు బుధకౌశికుడు ఋషి. శ్రీసీతారామచంద్రుడు దేవత. అనుష్టుప్ ఛందము. సీత శక్తి. రామభక్తి సంపన్నుడగు హనుమంతుడు కీలకము. శ్రీరామచంద్రుని అనుగ్రహముకొరకు రామరక్షాస్తోత్రజపమందు వినియోగము చేయబడుచున్నది.

ధ్యానమ్

ధ్యాయే దాజానుబాహుం ధృతశరధనుషం బద్ధపద్మాసనస్థం
పీతం వాసో వసానం నవకమలదళస్పర్ధినేత్రం ప్రసన్నమ్,
వామాంకారూఢ సీతాముఖకమల మిలల్లోచనం నీరదాభం
నానాలంకారదీప్తం దధత మురుజటామండలం రామచంద్రమ్.

ధనుర్బాణములు ధరించి, పద్మాసనాసీనుడై, పచ్చని వస్త్రములు దాల్చి, అప్పుడే వికసించిన పద్మపత్రములవంటి సుందరనేత్రములు కలిగి, వామభాగమున విలసిల్లు సీతాదేవి మోముపై చూపులు ప్రసరింపజేయు ఆజానుబాహుడు, మేఘశ్యాముడు, వివిధాలంకార విరాజమానుడు, విపులజటాజూటధారి, ప్రసన్నవదనుడును అగు శ్రీరామచంద్రుని ధ్యానించవలెను.

స్తోత్రమ్

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్,
ఏకైకమక్షరం పుంసాం మహాపాతకనాశనమ్. 1

శ్రీరామచంద్రుని దివ్యచరిత్రము నూరుకోట్ల శ్లోకములతో అతివిస్తారమైనది (దానిని వాల్మీకి సంగ్రహముగ రచించెను). అందలి ప్రతి అక్షరము జనుల మహాపాపములనుకూడ నశింపజేయును.

ధ్యాత్వా నీలోత్పలశ్యామం రామం రాజీవలోచనమ్,
జానకీలక్ష్మణోపేతం జటాముకుటమండితమ్. 2
సాసితూణ ధనుర్బాణపాణిం నక్తంచరాంతకమ్,
స్వలీలయా జగత్త్రాతు మావిర్భూతమజం విభుమ్. 3
రామరక్షాం పఠేత్ ప్రాజ్ఞః పాపఘ్నీం సర్వకామదామ్.

నల్లకలువవలె శ్యామవర్ణుడును, కమలములవంటి కన్నులు కలవాడును, జటాకిరీటముచే శోభిల్లువాడును, చేతులందు కత్తి, తూణీరము, ధనుర్బాణములు దాల్చినవాడును, రాక్షససంహారము చేసినవాడును, ఈ లోకమును రక్షించుటకై జన్మలేనివా డయినను లీలామానుషరూపముతో ఆవిర్భవించినవాడును, సర్వవ్యాపియు సీతాలక్ష్మణసమేతుడును అగు రాముని స్మరించి, బుద్ధిశాలియగువా డీ సకలాభీష్టముల నొసగి, పాపములను నశింపజేయు రామరక్షను పఠించవలెను.

"శిరో మే రాఘవః పాతు ఫాలం దశరథాత్మజః. 4
కౌసల్యేయో దృశౌ పాతు విశ్వామిత్రప్రియః శ్రుతీ,
ఘ్రాణం పాతు మఖత్రాతా ముఖం సౌమిత్రివత్సలః. 5

నా శిరమును రాఘవుడు కాపాడుగాక. నుదురును దశరథాత్మజుడు రక్షించుగాక. నేత్రములను కౌసల్యానందనుడు రక్షించుగాక. చెవులను విశ్వామిత్రప్రియుడు బ్రోచుగాక. ముక్కును యజ్ఞరక్షకుడు రక్షించుగాక. ముఖమును సౌమిత్రివత్సలుడు కాపాడుగాక.

జిహ్వాం విద్యానిధిః పాతు కంఠం భరతవందితః,
స్కంధౌ దివ్యాయుధః పాతు భుజౌ భగ్నేశకార్ముకః. 6

నా నాలుకను విద్యానిధి, కంఠమును భరతవందితుడు, స్కంధములను దివ్యాయుధుడు, భుజములను శివధనుర్భంగము చేసినవాడు కాపాడుగాక.

కరౌ సీతాపతిః పాతు హృదయం జామదగ్న్యజిత్,
మధ్యం పాతు ఖరధ్వంసీ నాభిం జాంబవదాశ్రయః. 7

చేతులను సీతాపతి, హృదయమును పరశురామవిజేత, నడుమును

ఖరనాశకుడు, నాభిని జాంబవంతున కాశ్రయమిచ్చిన వాడు కాపాడుగాక.

సుగ్రీవేశః కటీ పాతు సక్థినీ హనుమత్ప్రభుః,
ఊరూ రఘూత్తమః పాతు రక్షఃకులవినాశకృత్. 8

నడుమును సుగ్రీవుని స్వామియు, సక్థులను హనుమంతుని ప్రభువును, తొడలను రాక్షసవంశనాశకుడగు రఘుశ్రేష్ఠుడును కాపాడుగాక.

జానునీ సేతుకృత్ పాతు జంఘే దశముఖాంతకః,
పాదౌ విభీషణశ్రీదః పాతు రామోఽఖిలం వపుః." 9

మోకాళ్లను సేతునిర్మాత, పిక్కలను దశముఖాంతకుడు, పాదములను విభీషణునకు ఐశ్వర్యప్రదాత, సకలదేహమును రాముడు కాపాడుగాక.

ఏతాం రామబలోపేతాం రక్షాం యః సుకృతీ పఠేత్,
స చిరాయుః సుఖీ పుత్రీ విజయీ వినయీ భవేత్. 10

రామబలోపేతమగు ఈ రక్షను పఠించు పుణ్యాత్ముడు దీర్ఘాయుష్కుడు, సుఖవంతుడు, పుత్రవంతుడు, విజయవంతుడు, వినీతుడును అగును.

పాతాలభూతలవ్యోమచారిణశ్ఛద్మచారిణః,
న ద్రష్టుమపి శక్తాస్తే రక్షితం రామనామభిః. 11

పాతాళము, భూమి, ఆకాశములలోను, గూఢముగను సంచరించు జీవులును రామనామరక్షితుడైన వానిని చూచుటకు కూడ సమర్థులు కానేరరు.

రామేతి రామభద్రేతి రామచంద్రేతి వా స్మరన్,
నరో న లిప్యతే పాపైర్భుక్తిం ముక్తిం చ విందతి. 12

రామా! అని కాని, రామభద్రా! అని కాని, రామచంద్రా! అని కాని స్మరించునట్టి మనుజుడు పాపములచే స్పృశింపబడడు. భోగ మోక్షములు రెంటిని పొందును.

జగజ్జైత్రైకమంత్రేణ రామనామ్నాభిరక్షితమ్,
యః కంఠే ధారయేత్తస్య కరస్థాః సర్వసిద్ధయః. 13

సకల జగత్తును జయింపగల ఏకైకమంత్రమగు రామనామముచే సురక్షితమైన యీ స్తోత్రము నెవడు కంఠమున ధరించునో అతనికి సకలసిద్ధులును అందుబాటులో నుండును.

వజ్రపంజరనామేదం యో రామకవచం స్మరేత్,
అవ్యాహతాజ్ఞః సర్వత్ర లభతే జయమంగళమ్. 14

'వజ్రపంజర' మను పేరుగల ఈరామకవచమును పఠించు మనుజుని ఆనతికి తిరుగులేక, అంతటను జయమును, శుభమును పొందును.

ఆదిష్టవాన్ యథా స్వప్నే రామరక్షామిమాం హరః,
తథా లిఖితవాన్ ప్రాతః ప్రబుద్ధో బుధకౌశికః. 15

శ్రీశంకరుడు బుధకౌశికునికి స్వప్నమున సాక్షాత్కరించి ఏ ప్రకారముగ రామరక్షను ఆనతిచ్చెనో అదే ప్రకారముగ ఉదయముననే లేచి బుధకౌశికుడు దానిని లిఖించెను.

ఆరామః కల్పవృక్షాణాం విరామః సకలాపదామ్,
అభిరామస్త్రిలోకానాం రామః శ్రీమాన్ స నః ప్రభుః. 16

రాముడు కల్పవృక్షముల ఆరామము (తోట). ఆపదలన్నింటికి విరామము (సమాప్తి). ముల్లోకములలో పరమసుందరుడు. అట్టి శ్రీమంతుడగు రాముడు మాకు ప్రభువు.

తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ,
పుండరీకవిశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ. 17
ఫలమూలాశినౌ దాంతౌ తాపసౌ బ్రహ్మచారిణౌ,

పుత్రౌ దశరథస్యైతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. 18
శరణ్యౌ సర్వసత్త్వానాం శ్రేష్ఠౌ సర్వధనుష్మతామ్,
రక్షఃకులనిహంతారౌ త్రాయేతాం నో రఘూత్తమౌ. 19

యువకులు, సుందరులు, సుకుమారులు, మహాబలశాలులు, తెల్ల తామరలవలె విశాలములైన నేత్రములు కలవారు, నార వస్త్రములు, జింక తోలు తాల్చినవారు, పండ్లు-దుంపలు ఆహారముగా తీసికొనువారు, జితేంద్రియులు, తపస్వులు, బ్రహ్మచారులు, సకలజీవరక్షకులు, సకల ధనుర్ధారులలో శ్రేష్ఠులు, రాక్షసవంశనాశకులగు రఘుశ్రేష్ఠులు, దశరథ పుత్రులు, సోదరులగు రామలక్ష్మణులు మమ్ము కాపాడుదురు గాక.

ఆత్తసజ్జధనుషావిషుస్పృశా వక్షయాశుగ నిషంగ సంగినౌ,
రక్షణాయ మమ 'రామలక్ష్మణా వగ్రతః పథి సదైవ గచ్ఛతామ్.

అల్లెత్రాటిని వింట సంధించి, బాణము స్పృశించి, తరుగని బాణములు

కల తూణీరములు (అమ్ముల పొదులు) దాల్చిన రామలక్ష్మణులు నన్ను కాపాడుటకై మార్గమున సదా నాకు ముందు నడచుదురు గాక.

సంనద్ధః కవచీ ఖడ్గీ చాపబాణధరో యువా,
గచ్ఛన్ మనోరథాన్ నశ్చ రామః పాతు సలక్ష్మణః. 21

సదా సన్నాహముతో కూడి కవచము, ఖడ్గము, విల్లమ్ములు ధరించి యౌవనదశతో విలసిల్లు రాముడు లక్ష్మణసమేతుడై పురోగమించుచు మా కోర్కెల నీడేర్చుగాక!

'రామో దాశరథిః శూరో లక్ష్మణానుచరో బలీ,
కాకుత్స్థః పురుషః పూర్ణః కౌసల్యేయో రఘూత్తమః. 22
వేదాంతవేద్యో యజ్ఞేశః పురాణపురుషోత్తమః,
జానకీవల్లభః శ్రీమానప్రమేయపరాక్రమః.' 23

ఇత్యేతాని జపన్ నిత్యం మద్భక్తః శ్రద్ధయాన్వితః,
అశ్వమేధాధికం పుణ్యం సంప్రాప్నోతి న సంశయః. 24

(భగవంతు డిట్లు పలికెను-) 'రాముడు, దాశరథి, శూరుడు, లక్ష్మణానుచరుడు, బలవంతుడు, కాకుత్‌స్థుడు, పురుషుడు, పూర్ణుడు, కౌసల్యేయుడు, రఘూత్తముడు, వేదాంత వేద్యుడు, యజ్ఞేశుడు, పురాణ పురుషోత్తముడు, జానకీవల్లభుడు, శ్రీమంతుడు, అప్రమేయపరాక్రముడు' అను ఈ షోడశ(16)నామములు శ్రద్ధతో నిత్యము పఠించు నా భక్తుడు అశ్వమేధయాగము కన్న అధికఫలమును పొందును. సందేహము లేదు.

రామం దూర్వాదళశ్యామం పద్మాక్షం పీతవాససమ్,
స్తువన్తి నామభిర్దివ్యై ర్న తే సంసారిణో నరాః. 25

దూర్వాదళములవలె నల్లని మేను, తామరలవంటి కన్నులు కలవాడై, పచ్చని వస్త్రము దాల్చిన రాముని దివ్యనామములతో నుతించు నరులు

సంసారబంధమున తగులుకొనరు.

రామం లక్ష్మణపూర్వజం రఘువరం సీతాపతిం సుందరం
కాకుత్‌స్థం కరుణార్ణవం గుణనిధిం విప్రప్రియం ధార్మికమ్,
రాజేంద్రం సత్యసంధం దశరథతనయం శ్యామలం శాంతమూర్తిం
వందే లోకాభిరామం రఘుకులతిలకం రాఘవం రావణారిమ్.

లక్ష్మణునకు అన్న, రఘువంశశ్రేష్ఠుడు, సీతాదేవికి భర్త, సుందరుడు, కకుత్‌స్థవంశజుడు, దయాసముద్రుడు, గుణనిధి, బ్రాహ్మణ ప్రియుడు, ధర్మ నిష్ఠుడు, రాజులకు రాజు, సత్యనిష్ఠుడు, దశరథాత్మజుడు, నల్లనివాడు, శాంతస్వరూపుడు, సకలలోకసుందరుడు, రఘువంశమున కలంకార మైనవాడు, రాఘవుడు, రావణునికి శత్రువును అగు రామునకు నమస్కరించుచున్నాను.

రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే,
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః. 27

రాముడు, రామభద్రుడు, రామచంద్రుడు, బ్రహ్మాత్ముడు, రఘునాథుడు, ప్రభువు అగు సీతాపతికి వందనము.

శ్రీరామ రామ రఘునందన రామ రామ
శ్రీరామ రామ భరతాగ్రజ రామ రామ,
శ్రీరామ రామ రణకర్కశ రామ రామ
శ్రీరామ రామ శరణం భవ రామ రామ. 28

రఘునందనుడ వగు శ్రీరామా! భరతాగ్రజుడ వగు శ్రీరామా! రణధీరుడ వగు శ్రీరామా! నాకు నీవు రక్షకుడవగుము.

శ్రీరామచంద్రచరణౌ మనసా స్మరామి
శ్రీరామచంద్రచరణౌ వచసా గృణామి,
శ్రీరామచంద్రచరణౌ శిరసా నమామి
శ్రీరామచంద్రచరణౌ శరణం ప్రపద్యే. 29

శ్రీరామచంద్రుని పాదములు మదిలో ధ్యానింతును. శ్రీరామచంద్ర పాదములు వాక్కుచే కీర్తింతును. శ్రీరామచంద్ర పాదములకు శిరము వంచి ప్రణమిల్లెదను. శ్రీరామచంద్రుని పాదములు శరణుజొచ్చెదను.

మాతా రామో మత్పితా రామచంద్రః
స్వామీ రామో మత్సఖా రామచంద్రః,
సర్వస్వం మే రామచంద్రో దయాళుః
నాన్యం జానే నైవ జానే న జానే. 30

రాముడు నా తల్లి, రాముడు నా తండ్రి, రాముడు నా ప్రభువు, రాముడు నా మిత్రుడు. దయామయుడగు రాముడే నా సర్వస్వము. ఆయన తప్ప నాకు వేరొక్కరు తెలియరు.

దక్షిణే లక్ష్మణో యస్య వామే చ జనకాత్మజా,
పురతో మారుతిర్యస్య తం వందే రఘునందనమ్. 31

కుడి ప్రక్కన లక్ష్మణుడు, ఎడమప్రక్క సీత, ఎదుట హనుమంతుడు నిలచియుండగా నడుమ విరాజిల్లు రామచంద్రుని నమస్కరింతును.

లోకాభిరామం రణరంగధీరం
రాజీవనేత్రం రఘువంశనాథమ్,
కారుణ్యరూపం కరుణాకరం తం
శ్రీరామచంద్రం శరణం ప్రపద్యే. 32

లోకోత్తర సుందరాకారుడును, యుద్ధరంగమున ధీరుడును, పద్మనయనుడును, రఘువంశనాయకుడును, కరుణామూర్తియు, దయానిధియు అగు శ్రీరామచంద్రుని శరణు పొందెదను.

మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్,
వాతాత్మజం వానరయూథముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి. 33

మనసువలె, వాయువువలె మహావేగముతో సంచరించువాడును, ఇంద్రియములను అదుపులో నుంచుకొన్నవాడును, బుద్ధిశాలురలో శ్రేష్ఠుడును, వాయుపుత్రుడును, వానరయూథముఖ్యుడును, శ్రీరామ దూతయు అగు హనుమంతునికి శిరము వంచి ప్రణమిల్లుదును.

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్,
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్. 34

కవిత యను కొమ్మపై కూర్చుండి తీయని అక్షరములతో రామా! రామా! అని తీయగా కూయు వాల్మీకి యను కోకిలకు నమస్కరింతును.

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్,
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్. 35

ఆపదలను తొలగించువాడు, సకలసంపదల నిచ్చు వాడును, లోకైక సుందరుడును అగు శ్రీరాముని మాటిమాటికి నమస్కరింతును.

భర్జనం భవబీజానామర్జనం సుఖసంపదామ్,
తర్జనం యమదూతానాం రామ రామేతి గర్జనమ్. 36

రామా! రామా! అని యుద్ఘోషించుట సంసారబీజములను నశింప

జేయును. సుఖములను,సంపదలను పెంపొందజేయును. యమదూతలను భీతిల్లజేయును.

రామో రాజమణిః సదా విజయతే రామం రమేశం భజే
రామేణాభిహతా నిశాచరచమూ రామాయ తస్మై నమః,
రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్య దాసోఽస్మ్యహం
రామే చిత్తలయః సదా భవతు మే భో రామ మాముద్ధర. 37

రాజతిలకుడగు రామునకు సదా జయము. నేను లక్ష్మీపతి యగు రాముని భజింతును. రామునిచే రాక్షససేన హతమార్చబడినది. అట్టి రామునకు నమస్కారము. రాముని కన్న ఉత్తమమగు ప్రాప్యము వేరొకడు లేడు. నేను రామునకు దాసుడను. నా మది యెల్లపుడు రాముని యందు లీనమగు గాక. రామా! నన్నుద్ధరింపుము.

రామ రామేతి రామేతి రమే రామే మనోరమే,
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే. 38

(శంకరుడు పార్వతి కిట్లనెను-) ఓ మనోహరీ! రామనామము విష్ణుసహస్రనామములతో సమానము. నేను సదా 'రామా! రామా! రామా!' అని మనోహరుడగు రాముని (నామస్మరణ చేయుట) యందే రమింతును.

ఇతి శ్రీబుధకౌశికమునివిరచితం శ్రీరామరక్షాస్తోత్రం సంపూర్ణమ్.

ఇట్లు శ్రీబుధకౌశికముని రచించిన శ్రీరామరక్షాస్తోత్రము సమాప్తము.